
సాక్షి
బాపట్ల
బుధవారం । 24 । జూలై । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు.



ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ మాచవరానికి చెందిన ఎం.శ్రీయన్ కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.

న్యూస్‌రీల్

సమీకృత కలెక్టరేట్‌కు స్థల పరిశీలన చేస్తున్నాం

కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: సమీకృత కలెక్టరేట్ భవనానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాలను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం కలెక్టరేట్ ఏపీ హెచ్‌ఆర్‌డీ పరిధిలో కొనసాగుతుండగా అక్కడ 57.17 ఎకరాల విస్తీర్ణంలో ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. భూమికి సంబంధిచిన దస్త్రాలు, మ్యాప్‌లను పరిశీలించారు. ప్యాడిసన్ పేటలో ఖాళీగా ఉన్న 54.16 ఎకరాలు, మూలపాలెంలోని వైద్య కళాశాల భవనం వద్ద ఉన్న భూమి, కర్లపాలెం సత్యవతి పేటలోని తాటితోపు స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ రవీందర్ ఉన్నారు.

బాపట్ల టీపీఓగా వెంకటేశ్వర్లు

బాపట్ల: పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏపీఓగా ఉన్న వెంకటేశ్వర్లును ఇన్‌చార్జి టీపీఓగా నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆక్వా పార్కుకు భూమి పరిశీలన



నిజాంపట్నం: ఆక్వా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆక్వా పార్కును ఏర్పాటు చేస్తుందని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని దిండి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఆక్వా పార్కుకు అవసరమైన భూమిని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 300 ఎకరాలు సేకరించడం జరుగుతుందని చెప్పారు. అందులో 50 ఎకరాలు పర్యాటక శాఖకు, 50 ఎకరాలు రిజర్వ్ ఫారెస్ట్ కింద అటవీశాఖకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. సుమారు 190 ఎకరాల్లో ఆక్వా పార్కు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ ఉన్నారు.

బోధనలో సృజనాత్మకత ఉండాలి

– జిల్లా సమగ్ర శిక్ష అధికారి సుధాకర్



వేటపాలెం: బోధనలో సృజనాత్మకత ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష అధికారి ఎంవీ సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట, పాపాయిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలవుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను మంగళవారం పరిశీలించారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో పునాది అభ్యసనానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యసనాన్ని పరిశీలించారు. ఆకర్షణీయమైన బోధనాభ్యసన సామగ్రి తయారు చేసి ఉపాధ్యాయులు తరగతి బోధనలో సృజనాత్మకంగా ఉండాలని అన్నారు. పునాది అభ్యసనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటించారు. పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుబ్బయ్య, ఐ పురుషోత్తమరావు, సీఆర్పీ బీ సుజాత పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

చీరాల: గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి బాపట్ల జిల్లా చీరాల రూరల్ మండలం ఈపురుపాలెం జెండాచెట్టు వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. జెండాచెట్టు వీధిలో పిల్లి లలిత (74) ఒంటరిగా నివాసం ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన ఒంటరిగా నిద్రిస్తున్న లలిత ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు కత్తులతో వచ్చి హతమార్చి పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించి సమాచారం సేకరిస్తున్నారు.

కూటమి కోతలు

ఏటిని నిట్టనిలువునా నిలబెడతా.. నిప్పుని నీటితో మండిస్తా.. ఏనుగును తొండం మీద నడిపిస్తా.. ఎవరూ చేయలేనిది ఇంకొకటి కూడా చేస్తా.. నేను గాలికి రంగులేస్తా అన్న చందంగా చంద్రబాబు ప్రజలను బురిడీ కొట్టించాడు. సూపర్ సిక్స్ పేరుతో అలవికాని హామీలు కుమ్మరించాడు. ప్రజలు నమ్మి అధికారం ఇచ్చారు. ఇప్పుడు హామీల ఊసే ఎత్తడం లేదు. శ్వేత పత్రాల పేరుతో గారడీ చేసేందుకు చూస్తున్నాడు. నమ్మిన జనం ఓపిక పరీక్షిస్తున్నాడు. బాబుతో పాటు కూటమి నేతలు ఇచ్చిన హామీలపై ఆశలు పెట్టుకున్న ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. బడ్జెట్ కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

–సాక్షి ప్రతినిధి, బాపట్ల



సూపర్‌సిక్స్ పేరుతో బురిడీ

- మాటలకే పరిమితమైన నాయకులు
- హామీల అమలుపై దృష్టి పెట్టని వైనం
- అరకొర ఇచ్చి ఒకటీ అరా అమలంటూ హడావుడి
- మాట నిలుపుకోవాలంటున్న జనం

ఖరీఫ్ సీజన్ వచ్చినా...

ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సిఉంది. ఖరీఫ్ నడిచొంటున్నా ఒక్క రూపాయి కూడా రైతులకు జమ చేయలేదు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మే నెలలోనే రైతు భరోసా అందించి అండగా నిలబడ్డారు.

తల్లికి వందనమేదీ..

ఎన్నికల ముందు తల్లికి వందనం కింద పిల్లల చదువులకు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తామన్నారు. జిల్లాలో గత ప్రభుత్వంలో కుటుంబానికి ఒక్కరు చొప్పున 1,16,019 మందికి రూ.174.02 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు నలుగురు సంగతి దేవుడెరుగు కూటమి నేతలు హామీ ఇచ్చినట్లు కుటుంబానికి ఇద్దరు చొప్పున ఇచ్చినా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంది. పాఠశాలలు ప్రారంభమైనా తల్లులపేర పైసా జమ చేయలేదు.

కొందరికే పింఛన్లు..

జిల్లాలో 2,35,791 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పాత పింఛన్‌దారులకు మాత్రమే పింఛన్ ఇచ్చి మిగిలిన వారికి ఎగనామం పెట్టింది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ప్రతి మహిళకు రూ.15 వేలు కూటమి సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రతి మహిళకు 15 వేలు రూపాయలు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చింది. మహిళలకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ ఇంత వరకు ఊసే ఎత్తడం లేదు. మహిళలు తమ ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారని ఎదురుచూస్తున్నారు. జమ చేస్తారనే ఉద్దేశంతో ఇప్పటికే బ్యాంకులు చుట్టు తిరుగుతున్నారు.

కుప్పలు తెప్పలుగా హామీలు...

కూటమి ప్రభుత్వం జనాన్ని మభ్యపెట్టి అధికారంలోకి రావాలన్న ఏకైక లక్ష్యంతో కుప్పలు తెప్పలుగా హామీలు కురిపించింది. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల జీతం, రైతు కూలీలకు కార్పొరేషన్లు, 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం, ట్రాన్స్‌ఫార్మర్ల ధరల తగ్గింపు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వడ్డీలేని రుణాలు, ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు, డ్రైవర్ల సాధికార సంస్థ. ఇలా చెప్పుకుంటూ పోతే కూటమి మ్యానిఫెస్టో 66 హామీలు గుప్పించింది.

జిల్లాల్లోనూ హామీల పరంపర

బాపట్ల, రేపల్లె, అద్దంకితో పాటు అన్ని నియోజకవర్గాల్లో వంద పడకల ఆస్పత్రులు, తాగునీటి పథకాలు, డంపింగ్ యార్డుల ఏర్పాటు, జిల్లా వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి, బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో చివరి ఆయకట్టుకు సాగునీటి తరలింపు, లిఫ్ట్ స్కీములు, తీరంలో తుఫాన్ షెల్టర్ల నిర్మాణం, పర్యాటక అభివృద్ధికి మరిన్ని పథకాలు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలపడంతో పాటు వందలాదిగా హామీలు ఇచ్చారు. ఇప్పటి వరకూ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆ దిశగా పాలకుల పనులు కూడా లేవు.

వైఎస్ జగన్ పాలనలో జిల్లా అభివృద్ధికి బాటలు...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లాలో వేలకోట్లతో అభివృద్ధి పనులు సాగాయి. అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలు అందాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించారు.

2019 జూలై 12న అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించి అమలు చేసిన పథకాలు ఇవే..

- రైతులకు వడ్డీ లేని రుణాలు
- పంటల బీమా సొమ్ము రైతులు కాకుండా ప్రభుత్వం చెల్లించడం
- రైతు భరోసా
- ఆత్మహత్యలు చేసుకున్న రైతులు, కౌలు రైతులకు రూ.7 లక్షల పరిహారం
- అమ్మఒడి
- నాయీబ్రాహ్మణులకు ఏడాదికి రూ.10 వేతనం
- రజకులకు ఏడాదికి రూ.10 వేలు
- ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు
- టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- ఇమామ్‌లకు రూ.10 వేలు, మూజమ్‌లకు రూ.5 వేలు చొప్పునవేతనాలు పెంపు
- వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా బీసీలకు రూ.50 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష బహుమానం
- నామినేటెడ్ పోస్టులకు 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, అందులో 50 శాతం మహిళలకు
- అభివృద్ధి పనుల కాంట్రాక్టుల్లో కూడా రిజర్వేషన్లు, అందులో 50 శాతం మహిళలకు కేటాయింపు.

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నోరు మెదపటంలేదు. గతంలో ఖరీఫ్‌కు ముందుగానే జగనన్న ప్రభుత్వం రైతుభరోసా పేరుతో పెట్టుబడిసాయాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమ చేసింది. ఇప్పటి వరకు పెట్టుబడి సాయంపై కూటమి ప్రకటన చేయకపోవటంతో రైతులు పంట పెట్టుబడి కోసం అప్పులు చేసే పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటితో పాటు ఇంట్లో చదువుకునే ప్రతి బిడ్డకు అమ్మకు వందనం పేరుతో రూ.15వేలు ఇస్తామని, 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలలోపు మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి ఆ ఊసే ఎత్తకపోవటం తగదు. 50 రోజుల కూటమి పాలనలో ప్రజలకు చేసింది శూన్యం.

–మోపిదేవి వెంకట రమణారావు, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు

రావణ రాజ్యం వచ్చింది



రామ రాజ్యం పోయి రావణ రాజ్యం వచ్చింది. క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేసే ప్రభుత్వం పోయింది. ఇప్పుడున్న ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చడంలేదు. పంటలు వేసే సమయం మించి పోతున్నా రైతు భరోసా ఇవ్వలేదు. నెల గస్తున్నా తల్లికి వందనం ఊసేలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి అధికారం చేపట్టగానే పథకాల ఫైళ్లపై సంతకం పెట్టిన ఘనత సాధించారు. చంద్రబాబుకు ఇచ్చిన హామీలను నెరవేరవేర్చే చిత్తశుద్ధి లేదు. కప్పదాటు వ్యవహారం సరికాదు.

–పానెం చిన హనిమిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, అద్దంకి

హామీలపై నోరుమెదపడం లేదు..



బూటకపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 50 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీలేదు. గత ప్రభుత్వంలో ఇంటింటికి అందించిన పింఛన్ల పథకం తప్ప మరే ఇతర పథకం అమలు చేయలేదు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి ఇప్పుడు ఊసే ఎత్తటంలేదు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగించటంతో పాటు రూ.10 వేలు గౌరవ వేతనం అందిస్తామని చెప్పిన చంద్రబాబు వాటికి గురించి మాట్లాడం లేదు. ఎన్నికల మేనిఫెస్టో అమలుకు కార్యాచరణ ప్రకటించాలి.

డాక్టర్ ఈవూరి గణేష్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, రేపల్లె

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. పాఠశాలలు పునః ప్రారంభమై నెల గడుస్తోంది. ఇంత వరకు అమ్మకు వందనం కింద రూ.15 వేలు జమ చేయలేదు. రైతులకు, కౌలు రైతులకు రూ.20 వేలు అకౌంట్‌లో జమ చేస్తామని మాట ఎత్తడం లేదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాఠశాలలు పునః ప్రారంభం చేసిన వెంటనే అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులు అకౌంట్‌లో జమ చేశారు. రైతులకు ఖరీఫ్ పెట్టుబడుల కోసం మే నెలల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

–వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, వేమూరు

సాయం కోసం ఎదురుచూపులు



గత ఐదేళ్లపాటు రైతులకు వ్యవసాయ పనులకు ముందుగానే రైతు భరోసా అందించడం జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతులు గురించి పట్టించుకోవటం లేదు. రైతులు పెట్టుబడి కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. అదే విధంగా విద్య సంవత్సరం ప్రారంభమైన వెంటనే అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులకు నేరుగా నగదు జమ చేసే వారు. తల్లికి వందనం పేరుతో ముందుకు వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోవటంలేదు.

కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్యే, బాపట్ల

తీరం అభివృద్ధిపై సీతకన్ను

- చేనేతలు, మత్స్యకారుల ప్రస్తావన శూన్యం
- కేంద్ర బడ్జెట్‌లో పారిశ్రామిక కారిడార్ ప్రస్తావన
- వెనుకబడిన జిల్లాలకు నిధులు దక్కేనా...



చీరాల: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలకు నిరాశ కలిగించింది. కొత్తగా బాపట్ల జిల్లాగా ఏర్పడినప్పటికి బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యం దక్కించుకోలేకపోయింది. జిల్లాలో సుదీర్ఘమైన తీరప్రాంతంతో పాటు పర్యాటక రంగానికి అనువైన బీచ్‌లు ఉన్నప్పటికి పట్టించుకోలేదని నిపుణులు భావిస్తున్నారు. ఎప్పటి నుంచో హామీలు గుప్పిస్తున్న మినీ హార్బర్(జెట్టీత) ఊసే ఎత్తలేదు. దీంతో కేంద్ర బడ్జెట్‌పై ఈ ప్రాంత ప్రజలు పెదవి విరుస్తున్నారు.

తీరం ప్రాధాన్యం ఇలా..

బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల, పర్చూరు, అద్దంకి, రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని 76 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. 245 మెకనైజ్డ్ బోట్లు, 2,599 మోటారు బోట్లు, 228 సంప్రదాయ తెప్పలున్నాయి. 12,060 మంది మత్స్యకార కుటుంబాలు తీరాన్ని ఆసరాగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నిత్యం ప్రాణాలతో బతుకు వేట సాగించే మత్స్యకారుల సంక్షేమం కోసం ఎదురుచేసిన మత్స్యకారులకు నిరాశ ఎదురైంది. వేట నిషేధ కాలంలో చేయూత నివ్వకుండా కాలయాపన చేయడంతో గంగపుత్రులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని వాపోతున్నారు. వేటకు వినియోగించే వలలు, డీజిల్ సబ్సిడీ పెంచకపోవడం, వేట చేయగా వచ్చిన మత్స్య సంపదను దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి తమను దగా చేస్తున్నా పట్టించుకున్న వారు లేరని వాపోతున్నారు.

చేనేతగా ఆదరణ లేక



జిల్లాలో పరిధిలో జిల్లాలో చీరాల, వేటపాలెం, చెరుకుపల్లి, రేపల్లె, భట్టిప్రోలు, మార్టూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లో చేనేత కార్మికులున్నారు. చేనేత వస్త్రాలకు వినియోగించే చిలపనూలుపై జీఎస్టీ తగ్గించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. మార్కెట్ చేనేత వస్త్రాల పేరుతో మరమగ్గాలపై తయారైన వస్త్రాలు రాజ్యమేలుతున్నాయి. మాస్టర్ వీవర్స్ వద్ద రూ.50 కోట్ల విలువైన వస్త్రాలున్నాయి. చేనేత కార్మికులకు పని లేదు. వీరిపై బడ్జెట్‌లో ఎలాంటి హామీ లేదు.

వెనకబడినా ప్రాంతాలకు నిధులు అంటూ..

ఇదిలా ఉంటే బడ్జెట్ కేటాయింపుల్లో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు ప్రకటించింది. ఇందులో ప్రకాశం జిల్లా ప్రస్తావన కూడా ఉంది. నిధులు కేటాయిస్తే ఉమ్మడి ప్రకాశంలో ఉన్న బాపట్ల జిల్లాకు కూడా వెనుకబడిన జిల్లాల కోటాలో కొంత మేలు జరగనుంది. వైజాగ్ నుంచి తీరప్రాంతంలో కోస్టల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

ఆక్వా రైతులకు ఊరట



ఆక్వా రైతులకు కొంత ఊరట లభించింది. రొయ్యల మేత ధరలను గణనీయంగా తగ్గించింది. దీంతో జిల్లాలో ఆక్వా రంగానికి ఊతం ఇచ్చినట్లైంది. జిల్లాలో పది వేల మంది ఆక్వా రైతులు ఉండగా 22,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రొయ్యల మేతకు ధరలు తగ్గించడంతో ఆక్వా రైతులకు మేలు.

కష్టాలను పట్టించుకోని బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజల కష్టాలను తీర్చేలా లేదు. కేవలం కంటి తుడుపు బడ్జెట్‌గా ఉంది. వ్యవసాయరంగం తర్వాత రెండో అతిపెద్ద రంగమైన చేనేత రంగం ఊసేలేదు. రంగులు, రసాయనాలు, జీఎస్టీలు గురించి ప్రస్తావించకపోడం దారుణం. నిత్యావసరాల ధరలను తగ్గించే చర్యలు లేవు. బడ్జెట్ కంటే ముందే ధరలను పెంచిన వాటికి జీఎస్టీ తగ్గించి పరిశ్రమలకు రాయితీలు అందించామని చెప్పడం విడ్డూరంగా ఉంది. ఏపీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే.

– చిమటా సాంబు, మాజీ ఎంపీ

గ్రామాల్లో బరితెగిస్తున్న టీడీపీ

- వైఎస్సార్ సీపీ నాయకుడి చావిడి కూల్చివేత
- పోలీసుల సమక్షంలోనే ఘాతుకం
- ప్రైవేట్ కేసు వేస్తానంటున్న బాధితుడు



చింతమోటులో పశువుల చావిడిని పొక్లెయిన్‌తో కూల దోస్తున్న దృశ్యం

చింతమోటు(భట్టిప్రోలు): రోజురోజుకి టీడీపీ నాయకుల ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శొంఠి జయకృష్ణ కుటుంబానికి చెందిన పశువుల చావిడిని కుట్రపూరితంగా కూల్చివేశారు. పోలీసులు సమక్షంలో పొక్లెయిన్ సాయంతో నేలమట్టం చేశారు. గత ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లో స్వల్ప ఘర్షణ నేపథ్యంలో ఇబ్బందికి గురి చేయాలని ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా ఆ ప్రదేశంలో ఏర్పాటు చేసే కళ్యాణ మండపానికి చావిడి అడ్డం వస్తుందనే సాకుతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శొంఠి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి పి.దీపక్‌తో నోటీసు ఇప్పించారు. మంగళవారం ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు సమక్షంలోనే చావిడిని కూల్చివేయడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కోర్టుకు వెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ప్రైవేట్ కేసు వేయనున్నట్లు జయకృష్ణ పేర్కొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

జెడ్పీ సీఈఓ వసంత రాయుడు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వసంత రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగునీటి సరఫరాకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎన్ఎస్వీబీ వసంత రాయుడు పేర్కొన్నారు. నగరంపాలెంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సీఈఓ వసంత రాయుడు ప్రధాన మంత్రి గ్రామీణ ఆదర్శ యోజన (పీఎంఏజీవై) మొదటి విడతలో ఎంపికై న గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వారీగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులు జెడ్పీకి అందుబాటులో ఉన్న దృష్ట్యా, సంబంధిత నిధులతో సీపీడబ్ల్యూఎస్ పథకాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించిన అంశాలపై సీఈఓ వసంత రాయుడు అధికారులతో సమీక్షించారు. పారిశుద్ధ్య పనుల వివరాలను రోజూ పీఆర్-1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలో 50 లక్షల మొక్కలను నాటాలని కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించారని, దీనికోసం కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

104 శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్



నగరం: గ్రామాలలో నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ చెప్పారు. మండలంలోని వెలమవారిపాలెంలో వైద్యశిబిరాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరానికి తప్పనిసరిగా డాక్టర్ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, వైద్యాధికారి నజీలాపర్వీన్, సీహెచ్ఓ బాబూరావు పాల్గొన్నారు.

మునిగిన పంట పొలాలు పరిశీలన

మోదుకూరు(వేమూరు): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల వలన నీట మునిగిన వరి పంటను ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఉషా మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు వలన నీట మునిగి పొలాలు నివేదిక ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. నీటి మునిగిన వెద సాగు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, జిల్లా రిసోర్సు సెంటరు ఏడీఏ రత్నకుమారి, మండల వ్యవసాయాధికారి బండ్ల మూడి ఆదాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరరావు, మాణిక్యరావు, కేతావత్ దేవిలాల్ నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మంగళవారం మరణించాడు. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి 7వ నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వృద్ధుడు(50) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. రోజు వారీ తనిఖీల్లో భాగంగా అతడిని గుర్తించిన జీఆర్పీ పోలీసులు వెంటనే 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించాడు. అతడికి సంబంధించిన వివరాలేమీ తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపారు. వృద్ధుడి సమాచారం తెలిసిన వారు గుంటూరు రైల్వే పోలీసులు 9440627546,9550523485 నంబర్లను సంప్రదించాలని జీఆర్పీ సీఐ కోరారు.

ఇసుక తవ్వకాలపై జేసీ ఆగ్రహం

- పెనుమూడి ఇసుకరీచ్‌కు అనుమతులు లేవు
- ఇసుక తవ్వే వారిపై చర్యలకు ఆదేశం
- నిఘా లోపిస్తే అధికారులపై వేటు తప్పదు
- జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

సాక్షి ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

రేపల్లె రూరల్: పెనుమూడిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలపై 'సాక్షి'లో 'పెనుమూడి రేవులో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు'పై ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. పెనుమూడిలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, తవ్వకాలు జరిపితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాలను ప్రోత్సహించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకువచ్చిందని చెప్పారు. రేపల్లె డివిజన్‌లోని కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్‌లో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. ఇసుక కావాల్సిన వారు జువ్వలపాలెం నుంచి తెచ్చుకోవచ్చన్నారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలలో ఇసుక తవ్వకుండా అధికారులు నిఘాను ఉంచాలని కోరారు. అనంతరం ఇసుకపల్లి రోడ్డులోని పౌరసరఫరాల శాఖ గోదామును తనిఖీ చేశారు. గోదాములోని స్టాకును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీఓ హెలా షారోన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, తహసీల్దార్ రవీంద్ర, పట్టణ సీఐ నజీర్‌బేగ్ పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

ఎస్పీ తుషార్ డూడి



జిల్లాలోని నిర్మానుష్య ప్రదేశాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: మహిళలు.. చిన్నారుల భద్రతకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్మానుష్య ప్రదేశాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులు గస్తీ నిర్వహించి, అనుమానిత ప్రదేశాల్లో మంగళవారం సోదాలు నిర్వహించారు. ఎస్పీ కార్యాలయంలో తుషార్ డూడి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి, గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలను, వినియోగాన్ని అరికట్టడానికి, ఆకతాయిల ఆగడాలను కట్టడి చేయడానికి పగటి పూట గస్తీ నిర్వహించడం జరిగిందని చెప్పారు. నిర్మానుష్య ప్రదేశాల్లో, ఆకతాయిలు ఎక్కువగా ఉండడానికి, నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో పోలీస్ సిబ్బంది విస్తృతంగా గస్తీ నిర్వహించారన్నారు. ప్రధాన కూడళ్లలో, పాఠశాలలు, కళాశాల వద్ద, ముఖ్యమైన ప్రదేశాల్లో పెట్రోలింగ్ నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. జిల్లాలో ఎవరైనా, ఎక్కడైనా మహిళల పట్ల, చిన్నారులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసిన, భద్రపరిచినా, విక్రయించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు.

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ



తాతావారిపాలెంలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ

తాతావారిపాలెం(భట్టిప్రోలు): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ ఎస్.విజయమ్మ కోరారు. మంగళవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెంలో వైరల్ ఫీవర్లు ప్రబలడంతో గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించి రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. కుష్ఠు వ్యాధిపై జరుగుతున్న సర్వేపై ఆరా తీశారు.

నదీ పరీవాహక లంక గ్రామాలలో ముందస్తుగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. వరద ముప్పు పోయిన తర్వాత గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలంలో విష సర్పాలు అధికంగా సంచరించే ప్రమాదం ఉన్నందున స్నేక్ బైట్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని వైద్యసిబ్బందికి సూచించారు. తాతావారిపాలెంలో ప్రస్తుతం వైరల్ జ్వరాలు అదుపులో ఉన్నాయని, గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వైరల్ జ్వరాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 52 డెంగీ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

ప్రజలకు అవగాహన కోసమే బహిరంగ ప్రజావేదిక

సోషల్ ఆడిట్‌లో డ్వామా పీడీ రాజేష్



మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజేష్

చినగంజాం(పర్చూరు): జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేసేందుకే బహిరంగ ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పర్చూరు మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌కు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. జరిగిన పనిదినాలు, కార్మికులకు ఇచ్చిన వేతనాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న విషయాల గురించి ప్రజలకు కూడా అవగాహన ఉండేందుకే బహిరంగ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన పనిదినాలను తప్పనిసరిగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రైతులకు, గ్రామానికి ఉపయోగపడే పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, ఎండీడీఓ శ్రీనివాసరెడ్డి, హెచ్ ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఓ డక్కుమల్ల బుల్లయ్య, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవులకు నిరాశే

మేకల సుబ్బారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర బడ్జెట్ వేతన జీవులను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఆదాయపు పన్ను స్లాబులు ఆశాజనకంగా లేవని పేర్కొన్నారు. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని, పాత పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్యతరగతి వర్గాలకు, సామాన్య వేతన జీవులకు మేలు చేకూరేదని చెప్పారు. నూతన పన్ను విధానంలో రూ.ఏడు లక్షల ఆదాయం వరకు ఉండే వారికి ఇచ్చే రిబేటును, పాత పన్ను విధానంలో ఉండే వారికి కూడా వర్తింపజేసి ఉండాల్సిందన్నారు. సేవింగ్స్ పరిమితిని కనీసం రూ.2.5 లక్షలకు పెంచి ఉంటే, పొదుపు చేసుకునేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రూ.ఎనిమిది లక్షల వరకు పన్ను మినహాయింపు ఇస్తారని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిందని పెదవి విరిచారు. ప్రామాణిక తగ్గింపును రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం కొంతమేర ఉపయోగకరమైనా, ప్రస్తుతం జీవన వ్యయం బాగా పెరిగినందున రూ.లక్ష మేరకు పెంచితే ప్రయోజనకరంగా ఉండేదని చెప్పారు. ఆర్థిక భద్రత కలిగించడానికి సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బ్రహ్మానందకుమార్



మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న శిక్షణ సంస్థ డైరెక్టర్ బ్రహ్మానందకుమార్

ప్రత్తిపాడు: మహిళలు కుట్టు శిక్షణతో స్వయం ఉపాధిని పొందవచ్చని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జి. బ్రహ్మానందకుమార్ చెప్పారు. గుంటూరు కొత్తపేట యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా మండల పరిధిలోని తుమ్మలపాలెంలో 30 రోజులపాటు మహిళలకు టైలరింగ్‌పై శిక్షణనిచ్చారు. శిక్షణ ముగియడంతో మంగళవారం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందకుమార్ గ్రామస్తులతో కలిసి మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. డైరెక్టర్ జి.బ్రహ్మానంద కుమార్ మాట్లాడుతూ 30 రోజులపాటు నిష్ణాతులైన శిక్షకులతో కుట్టుశిక్షణపై మహిళలకు తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ తరగతులకు హాజరైన ప్రతి మహిళలకు ఉచితంగా కుట్టు సామగ్రిని కూడా అందించినట్టు వివరించారు. మహిళలకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయాన్నీ అందిస్తామని చెప్పారు. మహిళలందరినీ సమీకరించి వారి అభివృద్ధికి సహకరించిన వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంబాబు, వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సురేష్ గ్రామస్తులు, వాటర్ ఎయిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలో చాంపియన్ షిప్ పోటీలు



క్రోసూరు: ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలోని గుడ్‌షెపర్డ్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు మొత్తం 36 మందిని ఎంపికచేశామని ఉమ్మడి గుంటూరు జిల్లా క్రీడా అసోసియేషన్ సెక్రటరీ జి.శివపార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక సెయింటాన్స్ పాఠశాలలో జరిగిన క్రీడాకారుల ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి మొత్తం 170 మంది హాజరుకాగా వారిలో బాలురు 18, బాలికలు 18 మంది మొత్తం 36 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజిత, పీఈటీ మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు



నరసరావుపేట రూరల్: ఉద్యాన పంటలను సాగుచేస్తున్న రైతుల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలను అమలు చేస్తున్నట్టు జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ ద్వారా ఈ ఏడాది రూ.5.41కోట్లన్ను సబ్సిడీ ద్వారా రైతులకు అందజేయనున్నట్టు తెలిపారు. పండ్లతోటల విస్తరణ పథకంలో భాగంగా మామిడి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జామూన్ తోటలు, హైబ్రిడ్ కూరగాయలు, పూల తోటలు సాగుకు సబ్సిడీపై అందజేయనున్నట్టు తెలిపారు. ఉద్యాన యాంత్రీకరణ కింద చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్, తైవాన్ స్ప్రేయర్‌లను సబ్సిడి కింద మంజూరు చేస్తామని తెలిపారు. వివిధ పథకాలకు రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన ద్వారా రూ.61.30లక్షలను సబ్సిడీ ద్వారా రైతులకు అందజేస్తామని తెలిపారు. సాగుకు అనుకూలమైన మండలాల్లో రూ.68.64లక్షలను ప్రభుత్వం ఆర్థిక కేటాయింపు చేసినట్టు వివరించారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం



నరసరావుపేట: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ పల్నాడు జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పాలేటి శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని అరండల్‌పేటలో గల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.రామచంద్రరావు, జిల్లా కోశాధికారిగా వై.వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా డి.ఆరోన్‌రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎ.అనంతమ్మతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి తల్లపునేని రామారావు, ఉపాధ్యక్షులు మొక్కపాటి రాంబాబు వ్యవహరించారు.

రైతులకు సొమ్ము చెల్లించాల్సిన బాధ్యత కమీషన్ వ్యాపారులదే

మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతులు విక్రయించిన మిర్చి బస్తాలకు సొమ్ము చెల్లించాల్సిన బాధ్యత మిర్చి కమీషన్ వ్యాపారులదేనని మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు, యార్డు పర్సన్ ఇన్‌చార్జి కాకుమాను శ్రీనివాసరావు చెప్పారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు, యార్డు అధికారులు, సిబ్బందితో మంగళవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు పైకం ఇచ్చే సమయంలో కమీషన్ వ్యాపారులు తక్ పట్టీపై రైతు సంతకం విధిగా తీసుకోవాలని సూచించారు. రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు సొమ్మును అదే రోజు కమీషన్ వ్యాపారులు చెల్లించాలని, ఎవరైనా కమీషన్ వ్యాపారులు అదే రోజు పైకం చెల్లించకపోతే వారి లైసెన్స్ సస్పెండ్ లేదా శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు తమ సొమ్ములు అందకుంటే యార్డు కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.